@netifocusnews @focustv www.netifocusnews.com
TS-18-0006625

FOCUS TELUGU TV
అనునిత్యం - ప్రజాపక్షం

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

COMPLIMENTARY COPY

తెలుగు డిజిటల్ దినపత్రిక

| ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక | ఆదివారం, 08 అక్టోబర్ 2023 | సంపుటి: 01 | సంచిక : 24 | పేజీలు: 04 |
|---|---|---|---|---|---|



## సెలవు తేదీ మార్పు

- 23న దసరా సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-అక్టోబర్7:**

దసరా సెలవును ప్రభుత్వం మార్పు చేసింది. ఈ నెల 23వ తేదీన దసరా సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 24న సైతం సెలవును ఇచ్చింది. వాస్తవానికి దసరా పండుగ విషయంలో కొంత మిగతా 2లో..




## మహిళా బిల్లులో ఓబీసీలను చేర్చే వరకు పోరాడుతం

- ఎమ్మెల్సీ కవిత

**నేటి ఫోకస్ న్యూస్-అక్టోబర్7:**

భారత రాష్ట్ర సమితి నేత, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లండన్‌లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ కోటాను చేర్చే వరకు తమ పోరాటం ఆగదు అని మిగతా 2లో..



## హీరో నవదీప్‌కు ఈడీ పిలుపు

10న ఆఫీస్‌కు రావాలని ఆదేశం

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-అక్టోబర్7:**

మాదాపూర్ డ్రగ్స్ కేసులో టాలీవుడ్ నటుడు నవదీప్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నోటీసులు జారీచేసింది. ఈ నెల 10న హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని పేర్కొంది. నార్కోటిక్ బ్యూరో కేసు మిగతా 2లో..



కామారెడ్డిలో కేసీఆర్ పోటీపై

# దేశమంతా ఆసక్తి..

- కేసీఆర్ నిర్ణయం వెనక బలమైన కారణం
- సీఎం ప్రకటనతో విపక్షాల గుండెల్లో రైళ్లు
- కామారెడ్డి పర్యటనలో మంత్రి కేటీఆర్ వెల్లడి

**నేటి ఫోకస్ న్యూస్, కామారెడ్డి-అక్టోబర్7:**

కామారెడ్డిలో సీఎం కేసీఆర్ పోటీపై దేశమంతా ఆసక్తి చూపుతుందని మంత్రి కేటీఆర్ అన్నారు. కేసీఆర్ ఏ నిర్ణయం తీసుకున్నా దాని వెనుక బలమైన ఆశయం ఉంటుందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కేసీఆర్ పై పోటీ అంటే పోచమ్మ గుడిముందు పొట్టేలను కట్టేసినట్టేనని మిగతా 2లో..



# తెలంగాణ కేసీఆర్ అడ్డా

## ఎన్నికల్లో బీజేపీ డకౌట్.. కాంగ్రెస్ రనౌట్

- బిఆర్ఎస్ సెంచరీతో విజయం సాధిస్తుంది
- దిమ్మతిరిగేలా బిఆర్ఎస్ మేనిఫెస్టో రాబోతోంది
- సొంత రాష్ట్రంలో బొక్కబోర్లపడ్డా నడ్డా
- తెలంగాణకొచ్చి ఏం చేస్తడు
- మూడోసారి కేసీఆరే సీఎం
- మంచిర్యాల పర్యటనలో మంత్రి హరీష్‌రావు

**నేటి ఫోకస్ న్యూస్, మంచిర్యాల-అక్టోబర్7:**

బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాపై రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. నడ్డా.. ఈ తెలంగాణ కేసీఆర్ అడ్డా అని మంత్రి తేల్చిచెప్పారు. మంచిర్యాలలో మంత్రి హరీశ్‌రావు వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో మంత్రి హరీశ్ రావు పాల్గొని ప్రసంగించారు. ఇవాళ బీజేపోళు కూడా బాగా మాట్లాడుతున్నారు. నిన్న నడ్డా అని ఒకాయన వచ్చిండు. ఆ నడ్డాకు తెల్వది.. ఈ తెలంగాణ కేసీఆర్ గడ్డా అని గుర్తు పెట్టుకోవాలి. మిగతా 2లో..



## కృష్ణా జలాలను పొదుపుగా వాడుకోండి

తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకోండి

తెలుగు రాష్ట్రాలకు కేఆర్ఎంబీ సూచన

**నేటి ఫోకస్ న్యూస్,హైదరాబాద్-అక్టోబర్7:**

కృష్ణా నదిలో నీటి నిల్వలు తగినంతగా లేనందున..తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని వాడుకోవాలని తెలుగు రాష్ట్రాలకు కేఆర్ఎంబీ సూచించింది.శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాల నుంచి తెలంగాణకు 35, ఆంధ్రప్రదేశ్‌కు మిగతా 2లో..



## సీఎం కేసీఆర్ ఛాతిలో బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-అక్టోబర్7:**

గత పది రోజులుగా సీఎం కేసీఆర్ వైరల్ జ్వరంతో బాధప డుతున్నారు. దీంతో ఆయన ఆరోగ్య పరిస్థితిపై మంత్రి కేటీఆర్ స్పందించారు. ఛాతిలో సెకండరీ బ్యాక్టీరియ ల్ ఇన్‌ఫెక్షన్ వచ్చిందని మిగతా 2లో..



## సమస్యలు పక్కన్పెట్టిండ్రు

సీఎం బ్రేక్ ఫాస్ట్ అంటూ హడావిడి చేస్తున్నారు

- చదువుకుంటున్న పిల్లలను అడ్డం పెట్టుకొని రాజకీయాలు
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మండిపాటు

వివరాలు 02లో..



నిత్య నూతనంగా వెలువడుతూ..

నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక

సంచలన వార్తా కథనాలతో నిత్యం విశేష పాఠకాధరణ పొందుతున్న నేటి ఫోకస్ న్యూస్ డిజిటల్ తెలుగు దిన పత్రికకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల వారిగా, నియోజకవర్గాల వారిగా, మండలాల వారిగా, మండలాల వారిగా బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్లు, విలేకరులు కావలెను.

ఆసక్తి ఉన్నవారు ఈ క్రింది నెంబర్‌కు సంప్రదించగలరు.

9848488596

FOCUS TELUGU TV

బీఆర్ఎస్‌లో పెరుగుతున్న

## అసంతృప్తి

వరుసగా పార్టీని వీడుతున్న నేతలు

పార్టీకి రాజీనామా చేసిన ఎమ్మెల్యే రేఖానాయక్



**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-అక్టోబర్7:**

ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో భారత్ రాష్ట్ర సమితికి వరుస షాక్‌లు తగులుతున్నాయి. తమను వీడి ఎవరూ పోరన్న గుడ్డినమ్మకంతో ఉన్న పార్టీకి వరుస ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. ఇప్పటికే మైనంపల్లి హన్మంతరావు, తుమ్మల నాగేశ్వర రావు తదితరులు పార్టీని వీడారు. టికెట్ ఆశించి మిగతా 2లో..

## రెవెన్యూ డివిజన్‌గా ఏటూరు నాగారం

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-అక్టోబర్7:**

ములుగు జిల్లా ఏటూరు నాగారాన్ని డివిజన్‌గా కేంద్రం ఏర్పాటు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. కన్నాయి గూడెం, ఏటూరు నాగారం, మంగపేట, వెంకటాపురం, వాజేడు, తాడ్వాయి మండలాలతో రెవెన్యూ డివిజన్‌గా మిగతా 2లో..

# మార్పు తథ్యం

- విభజన జరిగిన వెంటనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చుంటే బాగుండేది
- తెలంగాణ ఎన్నో రెట్లు అభివృద్ధి చెందేది
- మోడీ ప్రభుత్వంలో మైనార్టీలు భయంతో బతుకుతున్నారు
- సమస్యలపై ఎవరు మాట్లాడటం లేదు
- మాజీ కేంద్రమంత్రి చిదంబరం కీలక వ్యాఖ్యలు



**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-అక్టోబర్7:**

క్రైస్తవ హక్కుల సమావేశం హరిహర కళాభవన్‌లో జరిగింది ఈ సమావేశానికి మాజీ కేంద్ర మంత్రి చిదంబరం, తెలంగాణ కాంగ్రెస్ ఇంఛార్జి మాణిక్ రావు ఠాక్రే థాక్రే, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కి గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ కేంద్రమంత్రి చిదంబరం మాట్లాడుతూ.. నాకు తెలుగు రాకున్నా..10,12 ఏండ్ల క్రితం తెలంగాణ గురించి మాట్లాడుతుంటే అర్థం అయ్యేది.. సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారు.. కానీ కాంగ్రెస్ అధికారంలో కి రాలేదు అని ఆయన అన్నారు. విభజన జరిగిన వెంటనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఉంటే.. ఎన్నో రెట్లు అభివృద్ధి చెందేది అన్నారు. సీడబ్ల్యూసీ మిగతా 2లో..

## బీఆర్ఎస్‌లో పెరుగుతున్న
# అసంతృప్తి

(మొదటి పేజీ తరువాయి..)

భంగపడిన నేతలు ఒక్కొక్కరిగా పార్టీలు మారేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. తాజాగా ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ బీఆర్ఎస్ కు రాజీనామా చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖా నాయక్ బీఆర్ఎస్ వీడనున్నారని బీఆర్ఎస్ అభ్యర్థుల తొలి జాబితా విడుదలైన సమయంలోనే ప్రచారం జరిగింది. తనకు టికెట్ కేటాయించకపోవడంతో అసంతృప్తికి లోనైన ఎమ్మెల్యే రేఖా నాయక్ ఎట్టకేలకు శుక్రవారం నాడు బీఆర్ఎస్ కు గుడ్ బై చెప్పారు. కేసీఆర్ పార్టీలో మహిళలకు గౌరవం లేదని ఆరోపించారు. పార్టీ తరఫున వరుస ఎన్నికల్లో గెలిచిన తనకు టికెట్ ఇవ్వకుండా అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో తాను కచ్చితంగా పోటీ చేస్తా అని స్పష్టం చేశారు. అయితే ఏ పార్టీ తరఫున తాను బరిలోకి నిలుస్తానో త్వరలోనే ప్రకటిస్తానని తెలిపారు. మరోవైపు రేఖా నాయక్ కు బీఆర్ఎస్ టికెట్ నిరాకరించిన సమయంలోనే ఆమె భర్త శ్యామ్ నాయక్ కాంగ్రెస్‌లో చేరడం తెలిసిందే. కేసీఆర్ నుంచి హామీ వస్తుందని ఆశించిన ఆమెకు భంగపాటు తప్పలేదు. దాంతో బీఆర్ఎస్ ను వీడాలని ఆమె నిర్ణయించుకున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ పై తీవ్రస్థాయిలో ఆమె మండిపడ్డారు. తన దగ్గర ఉన్న ఎస్.బి. కానిస్టేబుళ్లను కూడా తీయడం సరికాదని మండిపడ్డారు. ఖానాపూర్ లో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, పార్టీ అధ్యక్షుడు కావడానికి నేను ఎంతో కృషి చేశానని చెప్పారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అడ్డుకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని మండిపడ్డారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలలో తాను రెబల్‌గా నైనా, ఇండిపెండెంట్‌గా నైనా తప్పక పోటీలో ఉంటానని ఇటీవల చెప్పారు. అభివృద్ధి నేను చేస్తే గొప్పలు వారు వేరే వాళ్లు చెప్పుకోవడం సరికాదన్నారు. తన భర్త పార్టీ మారారని, తాను బీఆర్ఎస్ లో ఉన్నానని చెప్పినా వేధించారని ఎమ్మెల్యే ఇటీవల ఆవేదన వ్యక్తం చేశారు. కావాలనే తన అల్లుడు ఐపీఎస్ బదిలీపై స్పందిస్తూ రేఖానాయక్ కన్నీళ్లు పెట్టుకున్నారు. రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తండ్రి సీపీఐ పార్టీలో పనిచేయడం లేదా అని ఆమె ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో పని చేశానని, నియోజకవర్గం కోసం కూడా పని చేశానని చెప్పారు. 9 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్నానని... అభ్యర్థి కోసం అభివృద్ధిని ఆపడం ఏమిటని ఖనాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్ ప్రశ్నించారు. అయితే బిఆర్ఎస్ నుంచి మరిన్ని వలసలు ఉంటాయని అంటున్నారు. కాంగ్రెస్ పార్టీలోకి చాలామంది క్యూ కడతారని రేవంత్ రెడ్డి కూడా ఇటీవలే ప్రకటించారు.

# సీఎం కేసీఆర్ ఛాతిలో బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్

(మొదటి పేజీ తరువాయి..)

చెప్పారు. ఇప్పుడు ఆయన ఆరోగ్యంగానే ఉన్నారని.. త్వర లోనే ప్రజల ముందుకు వస్తారని మంత్రి కేటీఆర్ వెల్లడించారు. బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ వల్ల కోలుకోవడానికి కాస్త ఆలస్యమవు తుందన్నారు. ఇప్పుడు ఆయన ఆరోగ్యంగానే ఉన్నారని.. త్వర లోనే ప్రజల ముందుకు వస్తారని మంత్రి కేటీఆర్ వివరించారు. వారం రోజుల క్రితం సీఎం కేసీఆర్ వైరల్ జ్వరం, దగ్గుతో బాధపడుతున్నారంటూ మంత్రి కేటీఆర్ ట్విటర్‌లో ట్వీట్ చేశారు. కేసీఆర్‌కు ఇంట్లోనే వైద్య బృందం చికిత్స చేస్తోందని తెలిపారు. ఆయనను నిశితంగా పరిశీలిస్తోందన్నారు. కొద్ది రోజుల్లోనే అతను సాధారణ స్థితిలోకి చేరుకుంటారని వైద్యులు చెబుతున్నారని మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. ఇప్పుడు బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ అంటూ.. త్వరలోనే ప్రజల ముందుకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. వైరల్ ఫీవర్ కావడంతో గత మూడు వారాలుగా సీఎం కేసీఆర్ ప్రభుత్వ కార్యక్రమాలకు, ప్రజలకు దూరంగా ఉంటున్నారు. ఆయనను ప్రగతి భవన్‌లోనే వైద్యుల బృందం పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. సెప్టెంబరు 26న మంత్రి కేటీఆర్ ట్విటర్‌లో ట్వీట్ చేయడంతో ఈ విషయం అందరికీ తెలిసింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవంలో కనిపించిన సీఎం.. ఆ తర్వాత ప్రగతిభవన్‌లో జరిగిన వినాయక పూజలో కనిపించారు. వినాయక చతుర్థి తర్వాత నుంచి అసలు ముఖ్యమంత్రి కేసీఆర్ ఎలాంటి కార్యక్రమానికి, బహిరంగ సభకు వెళ్లలేదు. అప్పటి నుంచి ఇప్పటివరకు వైరల్ ఫీవర్‌తోనే బాధపడుతున్నట్లు కేటీఆర్ స్పష్టం చేశారు. కేసీఆర్ కామారెడ్డికి రావడంతో ప్రతిపక్షాల గుండెలు అదురుతున్నాయి. పదేళ్ల స్వల్ప కాలంలో వందేళ్ల ప్రగతిని పరిచయం చేశాం. కేసీఆర్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలి. హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్‌ను నిలపాలి. కేసీఆర్ విజయం ఎప్పుడో ఖాయమైంది.. తేలాల్సింది మెజార్టీ మాత్రమే.

# రెవెన్యూ డివిజన్‌గా ఏటూరు నాగారం

(మొదటి పేజీ తరువాయి..)

ప్రతిపాదిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మొన్నటి వరకు ములుగు రెవెన్యూ డివిజన్‌లో ఏటూరు నాగారం మండలం కొనసాగగా.. స్థానిక ప్రజల ఆకాంక్ష మేరకు సీఎం కేసీఆర్ ప్రభుత్వం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది. ములుగు డివిజన్‌లో గోవిందరావుపేట, వెంకటాపూర్, ములుగు మండలాలతో పాటు నూతనంగా ఏర్పాటయ్యే మల్లంపల్లి మండలం ఉండనున్నది. ఇదిలా ఉండగా.. ములుగు మండలంలో అంతర్భాగంగా ఉన్న మల్లంపల్లి గ్రామాన్ని.. మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తూ ప్రైమరీ నోటిఫికేషన్ జారీ చేసింది. అభ్యంతరాల స్వీకరణ పూర్తయ్యాక మండలంగా నోటిఫై చేస్తూ ఉత్తర్వులు జారీ చేయనున్నది.

# హీరో నవదీప్‌కు ఈడీ పిలుపు

(మొదటి పేజీ తరువాయి..)

ఆధారంగా ఈడీ నోటీలు జారీచేసినట్లు తెలుస్తున్నది. సెప్టెంబర్ 14న టీఎస్ న్యాబ్ అధికారులు బెంగళూరుకు చెందిన ముగ్గురు నైజీరియన్లు, ఓ దర్శకుడితోపాటు నలుగురి వ్యక్తులను అరెస్టు చేశారు. ఈ ముఠా నుంచి పలు రకాల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. విచారణ సందర్భంగా నిందుతులతో నటుడు నవదీప్ సంప్రదింపులు జరిపినట్లు తేలింది. అరెస్టయినవారిలో రామచందర్ అనే వ్యక్తి నుంచి నవదీప్ డ్రగ్స్ తీసుకున్నారని, తమవద్ద ఆధారాలు కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఆయనను టీన్యాబ్ పోలీసులు విచారించిన విషయం తెలిసిందే.

# మహిళా బిల్లులో ఓబీసీలను చేర్చే వరకు పోరాడుతం

(మొదటి పేజీ తరువాయి..)

ఎమ్మెల్సీ కవిత అన్నారు. లండన్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ అన్ని వర్గాల మహిళల్ని చేర్చుకోవడమే ముఖ్యమైన విషయమని, అన్ని కులాలు, అన్ని వర్గాలు, అన్ని ఆర్థిక స్థితిగతులకు చెందిన మహిళలను చేర్చాలన్నారు. ఇటీవల పాసైన మహిళా బిల్లులో ఓబీసీ మహిళల్ని చేర్చకపోవడం దురదృష్టకరమన్నారు. భారతీయ సమాజంలో ఓబీసీల వర్గం చాలా పెద్దదని, వారిని ఆ కోటాలో చేర్చే వరకు పోరాటం చేస్తామని ఆమె అన్నారు. బ్రిడ్జ్ ఇండియా కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎమ్మెల్సీ కవిత లండన్ వెళ్లిన విషయం తెలిసిందే. అక్కడ ఉన్న అంబేద్కర్ మ్యూజియాన్ని ఆమె సందర్శించారు.

# సెలవు తేదీ మార్పు

(మొదటి పేజీ తరువాయి..)

సందిగ్ధ పరిస్థితి నెలకొన్నది. ఈ క్రమంలో తెలంగాణ విద్వత్ సభ ఈ నెల 23న దసరా పండుగను నిర్వహించుకోవాలని సూచించింది. ఈ క్రమంలో ప్రభుత్వం విజయ దశమి సెలవును మార్చింది. ఇంతకు ప్రకటించిన సెలవును సైతం కొనసాగించింది. ఇదిలా ఉండగా.. పాఠశాల విద్యార్థులకు సెలవులతో పాటు, మిగతా వారికి అక్టోబర్ 23, 24 తేదీల్లో దసరా సెలవులు ఉంటాయని ప్రభుత్వం పేర్కొంది. బతుకమ్మ ప్రారంభ రోజును అక్టోబర్ 14న సాధారణ సెలవు ఇవ్వగా.. దుర్గాష్టమి అక్టోబర్ 22న ఐచ్ఛిక సెలవు ఇచ్చింది.

# తెలంగాణ కేసీఆర్ అడ్డా

(మొదటి పేజీ తరువాయి..)

నీ సొంత రాష్ట్రం హిమాచల్ ప్రదేశ్‌లోనే బీజేపీని గెలిపించుకోలేకపోయావు. నువ్వొచ్చి ఈ తెలంగాణలో ఏం చేస్తవు నడ్డా? తెలంగాణ గడ్డ.. ఇది కేసీఆర్ అడ్డా.. అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. సొంత రాష్ట్రంలో బొక్కబొర్లపడ్డా నడ్డా.. తెలంగాణలో బీజేపీని గెలిపిస్త అని మాట్లాడితే.. నీ నాటకాలు నడవవు అని నడ్డాను హరీశ్‌రావు హెచ్చరించారు. తెలంగాణలో బీజేపీ డకౌటే. బీజేపీ పోయినసారి ఒక్కటి గెలిచింది.. ఇప్పుడు ఆ ఒక్కటి కూడా రాదు గాక రాదు. ప్రపంచంలో లేని కమిటీలు వేస్తున్నవ్ కదా.. డిపాజిట్లు దక్కించుకునే ఓ కమిటీ వేసుకో అని సూచించారు. ఎందుకంటే.. గత ఎన్నికల్లో 100 స్థానాల్లో డిపాజిట్లు రాలేదు.. కనీసం ఇప్పుడు డిపాజిట్లు అయినా వస్తే పరువైనా దక్కుతది. చేరికల కమిటీ అని ఒకటి వేశారు. అది అట్టర్‌ఫ్లాఫ్ అయిపోయింది. కనీసం డిపాజిట్ల దక్కించుకునే కమిటీ వేసుకొని.. బీజేపీ పరువైనా కాపాడుకోండి అని మంత్రి సూచించారు. ఇంకొకాయన బీఎల్ సంతోష్ వచ్చి.. ఈ రాష్ట్రంలో హంగ్ వస్తదని అంటుండు.. మిస్టర్ సంతోష్ ఈ రాష్ట్రంలో హంగ్ కాదు.. హ్యాట్రిక్ కొడుతది బీఆర్ఎస్ పార్టీ. కచ్చితంగా కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అయితడు అని హరీశ్‌రావు తేల్చిచెప్పారు. బీఎల్ సంతోష్ కర్ణాటకలో బీజేపీని భ్రష్టు పట్టించిండు.. ఇప్పుడు తెలంగాణలో భ్రష్టు పట్టించేందుకు వచ్చిండు. మంచిదే.. నీలాంటోడు వస్తే అయింత నామరూపాల్లేకుండా పోతది.. మాకేం రంది లేదు. కానీ హంగ్‌లు గింగ్‌లు రావు.. తెలంగాణలో హ్యాట్రిక్‌లే వస్తయి. మీ గుజరాత్‌లో మూడు మూడు నాలుగు నాలుగు సార్లు గెలవొచ్చు.. కానీ మా కేసీఆర్ తెలంగాణలో మూడు మూడు నాలుగు నాలుగు సార్లు గెలవొద్దా? మీ గుజరాత్ కంటే మా తెలంగాణ పాలన నూరుపాళ్లు నయం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.



బీఆర్ఎస్ పార్టీ ప్రకటించబోయే మేనిఫెస్టోతో ప్రతిపక్షాలకు దిమ్మ తిరగాల్సిందే అని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. మంచిర్యాలలో మంత్రి హరీశ్‌రావు వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెన్షన్లు ఎంత పెంచాలి.. రైతుబంధు ఎంత పెంచాలి.. మహిళలకు ఇంకా ఏం చేయాలని సీఎం కేసీఆర్ సమాలోచనలు చేస్తున్నారని మంత్రి తెలిపారు. త్వరలోనే బీఆర్ఎస్ మేనిఫెస్టో రాబోతోంది. ఆ మేనిఫెస్టో వచ్చిందంటే ప్రతిపక్షాల మైండ్ బ్లాక్ అవ్వాల్సిందేనని అన్నారు. దిమ్మతిరిగిపోతది. కేసీఆర్ అంటే నమ్మకం, విశ్వాసం. కాంగ్రెసోళ్లు అంటే నయవంచన.. నాటకం. ఓట్ల కోసం మాయమాటలు చెబుతున్నారు. కొట్లాడుకునే సంస్కృతి వారిది. ఒక్క మాటలో కాంగ్రెస్ సంస్కృతి చెప్పాలంటే.. మాటలు, మూటలు, ముఠాలు, మంటలు. ఇది కాంగ్రెస్ పార్టీ సంస్కృతి అని మంత్రి తెలిపారు. అరచేతిలో వైకుంఠం చూపించి, కర్ణాటక నుంచి డబ్బులు సంచులు తెచ్చి గెలవాలని కాంగ్రెస్ పగటి కలలు కంటోంది అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కేసీఆర్ ఉన్నంత కాలం కాంగ్రెస్ ఆటలు సాగవు. కేసీఆర్ హయాంలో కరువు లేదు.. కర్ఫ్యూ లేదు. కరువు, కర్ఫ్యూలు లేకుండా ప్రశాంతంగా పరిపాలన సాగుతుంది. నక్సలైట్లతో చర్చలు జరపుతామని చెప్పి వారిని మట్టుబెట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది. ఆరు కిలోల బియ్యం, పగటి పూట కరెంట్ ఇస్తామని, తండాలను గ్రామపంచాయతీలు చేస్తామని చెప్పి మోసం చేశారు. వాళ్లు చేసిందేమీ లేదు. కేసీఆర్ ఢిల్లీని కదిలించి తెలంగాణను సాధించారు. తెలంగాణ రాకపోతే కల్యాణలక్ష్మి, రైతుబంధు వంటి పథకాలు వచ్చేవా అని హరీశ్‌రావు అడిగారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీజేపీ డకౌట్, కాంగ్రెస్ రన్ అవుట్ ఖాయం, కేసీఆర్ సెంచరీ కొట్టడం ఖాయమని మంత్రి హరీష్ రావు ధీమా వ్యక్తం చేశారు. శనివారం చెన్నూరులో బీఆర్ఎస్ భారీ రోడ్ షోలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసిన వంద సీట్లతో బీఆర్ఎస్ అధికారంలోకి రాబోతోందన్నారు. కర్ణాటక అవినీతి సొమ్ముతో కాంగ్రెస్ ఇక్కడ గెలవాలని అనుకుంటోందన్నారు. రేవంత్ రెడ్డి 10ఏళ్ల పాలనపై చర్చ అంటున్నారు. నీతో కాదు మాజీ ముఖ్యమంత్రులతో చర్చకు సిద్ధం. నాడు సోనియా గాంధీని బలిదేవత అన్న వ్యక్తి రేవంత్ రెడ్డి. రేవంత్ రెడ్డి రేపు ఏ పార్టీలోకి పోతడో తెలువదు. కాంగ్రెస్ అంటేనే మాటలు, ముఠాలు, మంటలు. హైదరాబాద్‌లో మతం మంటలు పెట్టిన పార్టీ కాంగ్రెస్' అంటూ వ్యాఖ్యలు చేశారు. గోదావరి వరదలపై సర్వే చేస్తామని.. అవసరమైతే కర కట్టలు కడతామని.. భూసేకరణ జరిపి రైతులను ఆదుకుంటామని మంత్రి హరీష్‌రావు పేర్కొన్నారు.

## కామారెడ్డిలో కేసీఆర్ పోటీపై
# దేశమంతా ఆసక్తి..



(మొదటి పేజీ తరువాయి..)

కామారెడ్డిలో కేసీఆర్ పోటీ ప్రకటన రాగానే ప్రతి పక్షాల గుండెల్లో రైళ్లు పరిగెత్తా యని వ్యాఖ్యానించారు. కామారెడ్డిలో కొడితే ప్రతిపక్షాల దిమ్మ తిరిగి మైండ్ బ్లాక్ కావాలని చెప్పారు. ఇక్కడ కేసీఆర్ గెలుపు ఖాయమైంది.. తేలాల్సింది మెజార్టీయేనని వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికతో దక్షిణ భారతదేశంలోనే సీఎం కేసీఆర్ సరికొత్త రికార్డు సృష్టిస్తారని పేర్కొన్నారు. దక్షణ భారతదేశంలోనే హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ రికార్డు సృష్టించబోతున్నారని తెలిపారు. జలసాధన ఉద్యమానికి సీఎం కేసీఆర్ కామారెడ్డిలో శ్రీకారం చుట్టారని తెలిపారు. తెలంగాణ ఉద్యమానికి నిధుల సేకరణకు కామారెడ్డిలోనే ప్రారంభమైందని వ్యాఖ్యానించారు. నెర్రెలు బారిన నేలలో పచ్చని పంటలు పండించా లన్నదే కేసీఆర్ ధ్యేయమని తెలిపారు. కేసీఆర్ ఏ నిర్ణయం తీసుకున్నా బలమైన ఆశయం.. ధృఢమైన సంకల్పం ఉంటుందని అన్నారు. సీఎం కేసీఆర్ ను కామారెడ్డి ప్రజలు గుండెల నిండుగా ఆశీర్వదించాలని కోరారు. కామారెడ్డి పర్యటనలో భాగంగా జరిగిన సభలో ఈ వ్యాఖ్యలు చేశారు. గంప గోవర్ధన్ విజ్ఞప్తి మేరకే కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేస్తున్నార న్నారని మంత్రి కేటీఆర్ తెలిపారు. కామారెడ్డి నియోజకవర్గం ఉద్యమ స్ఫూర్తిని తెచ్చిందన్నారు. నాడు గంప గోవర్ధన్ పార్టీలోకి రావడంతో బీఆర్ఎస్ బలం మరింతగా పెరిగిందన్నారు. కామారెడ్డి నుంచి పోటీ చేయమని కేసీఆర్‌ను గంప గోవర్ధన్ అడుగుతారని తాను భావించలేదని, ఇప్పటికే అభివృద్ధితో ముందుకు సాగుతోన్న ఈ నియోజకవర్గం రాష్ట్రంలో నెంబర్ వన్ చేయాలనే ఉద్దేశ్యంతో కేసీఆర్ ఇక్కడి నుంచి బరిలోకి దిగాలని ఆయన కోరినట్లు చెప్పారు. 8 మండలాల్లో స్థానిక ఎన్నికల్లో క్లాన్ స్వీప్ చేశామన్నారు. ప్రతీ నాయకుడు స్థానిక బూత్ లో మెజార్టీకి కృషి చేయాలని ఆయన కోరారు. ప్రతి గ్రామం, వార్డులో మేనిఫెస్టో తయారు చేయాలని చెప్పారు. అవసరమైన నిధు లు మంజూరు చేస్తామన్నారు. కామారెడ్డిలో మంత్రి కేటీఆర్ టూర్ కు ముందు నేతల వర్గ పోరు బయట పడ్డింది. కేటీఆర్ కు వెల్ కం చెబుతూ నగరంలో మున్సిపల్ చైర్ పర్సన్, జిల్లా అధ్యక్షుల ఫ్లెక్సీలు పెట్టారు. ఈ ఫ్లెక్సీల్లో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఫోటో పెట్టలేదు. స్థానిక ఎమ్మెల్యే ఫోటో లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సమస్యలు పక్కన్పెట్టిండ్రు

(మొదటి పేజీ తరువాయి..)

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-అక్టోబర్7:** మధ్యాహ్న భోజన పథకంలో సమస్యలు పట్టించుకోకుండా.. సీఎం బ్రేక్ ఫాస్ట్ అంటూ రాష్ట్ర ప్రభుత్వం హడావిడి చేస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మండిపడ్డారు. దీనిపై సీఎం కేసీఆర్‌కు మధ్యాహ్న భోజన పథకం సమస్యలపై బహిరంగ లేఖ రాశారు. చదువుకుంటున్న పిల్లలను అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేయడం తగదని.. బీఆర్ఎస్‌కు హితవుపలికారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు పెంచడంతో పాటు.. పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశ్యంతో చేపట్టిన మధ్యాహ్న భోజన పథకం ఈ ప్రభుత్వంలో అనేక సమస్యలను ఎదుర్కొందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆరోపించారు. మార్కెట్‌లో ధరలు భగ్గుమంటుంటే ప్రభుత్వం మాత్రం పెరిగిన ధరలకు అనుగుణంగా బడ్జెట్‌ను పెంచడం లేదని మండిపడ్డారు. కనీసం ఆ ధరలను సవరించడం లేదు.. సరికదా మధ్యాహ్న భోజనం మెనూలో మార్పులు చేస్తూ వంట కార్మికులకు ఆర్థిక భారంతో పాటు పని భారం పెంచుతున్నారని ధ్వజమెత్తారు. చాలా పాఠశాలల్లో వంట గదులే సక్రమంగా లేవని.. గతంలో నిర్మించినవి ఇరుకుగా ఉండడం.. శిథిలావస్థకు చేరడం జరిగాయని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ కారణాలతో ఆరు బయట, చెట్ల కింద కార్మికులు వంటలు కొనసాగిస్తున్నారన్నారు. ఇలాంటి వాటి వల్ల అక్కడక్కడ భోజనం కలుషితమై విద్యార్థులు అస్వస్థతకు గురైన సందర్భాలను చూశామని లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గత కొన్ని రోజులుగా ఆందోళనలు చేస్తున్న.. ఈ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన జీతాలను విడుదల చేయాలని.. నూతన మెనూకు బడ్జెట్‌ను పెంచాలని.. జీవో 8 ప్రకారం పెరిగిన వేతనాలను ఎరియర్స్‌తో సహా వెంటనే చెల్లించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులకు ఐడీ కార్డులు, యూనిఫాం ఇవ్వాలని.. నిత్యావసర వస్తువులను ప్రభుత్వమే ఉచితంగా పంపిణీ చేయాలని కోరారు. మరోవైపు రాష్ట్రంలో గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ అధ్వానంగా తయారైందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి లేఖలో పేర్కొన్నారు. మెనూ ప్రకారం ఎక్కడా భోజనం వడ్డించడం లేదని.. నాణ్యత ప్రమాణాలను పాటించడం లేదని.. ఉడికీ ఉడకని ఆహారం తినడం, నీరు, పరిసరాలు శుభ్రంగా లేకపోవడంతో విద్యార్థులు తరచూ అస్వస్థతకు గురైన సంఘటనలు చూశామన్నారు. నాణ్యమైన ఆహారం అందించాలని విద్యార్థులు రోడెక్కిన సంఘటనలను కూడా అనేకం చూశామని గుర్తు చేశారు. ఇప్పుడు అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని సరిగ్గా అమలు చేయడం లేదు కానీ మరోవైపు సీఎం బ్రేక్ ఫాస్ట్ అంటూ ప్రచార ఆర్భాటానికి పాల్పడుతూ రాజకీయాలు చేస్తున్నారని తీవ్రస్థాయిలో లేఖలో విమర్శలు చేశారు.

# మార్పు తథ్యం

(మొదటి పేజీ తరువాయి..)

మీటింగ్ హైదరాబాద్ లో ఇటీవల జరిగింది అని చిదంబరం అన్నారు. మీటింగ్ తర్వాత జరిగిన సభ.. నా జీవితంలో అలాంటి సభ చూడలేదు.. ఆ సభలో 45 శాతం 25 ఏళ్ల యువకులు ఉన్నారు.. సభ చూశాక.. తెలంగాణ మార్పు తథ్యం అని అర్థమైంది.. క్రిస్టియన్ కమ్యూనిటీ కూడా తమకు దక్కాల్సింది మిస్ అయ్యింది అనే ఫిలింగ్ లో ఉంది.. ఏ సమాజమైన మూడు కారణాలతో ఇబ్బంది పడుతున్నాయి.. నిరుద్యోగం అనేది మొదటిది.. 25 ఏళ్ల లోపు ఉన్న యువత 15 శాతం ఉద్యోగాలు లేకుండా ఉన్నారు.. ప్రతీ ఒక్కరు నిరుద్యోగ సమస్యని ఎదుర్కొంటున్నారు.. రెండో కారణం.. ధరల పెరుగుదల 20 నెలల నుంచి 6 శాతం ధరలు పెరిగాయి.. ఇది దేశ చరిత్రలో మొదటిది.. మూడో కారణం.. సేవింగ్స్ తక్కువ.. అప్పులు ఎక్కువ అయ్యాయని చిదంబరం పేర్కొన్నారు. ఢిల్లీ, హైదరాబాద్ ప్రభుత్వాలకు ఇవేం పట్టడం లేదు అని చిదంబరం అన్నారు. మోడీ వచ్చి కేసీఆర్ ని తిడతారు.. కేసీఆర్, మోడీని తిడతారు.. కానీ సమస్యలపై ఎవరు మాట్లాడటం లేదు.. చిన్నచూపు అనేది దేశంలో పెరిగింది.. మైనార్టీలు భయంతో బతుకుతున్నారు.. మోడీ ప్రభుత్వంలో అంతా భయంతో బతుకుతున్నారు.. కేంద్రంలో 79 మంది మంత్రులు ఉన్నారు.. కేవలం ఒక్కడే క్రైస్తవ మంత్రి ఉన్నారు అని ఆయన అన్నారు. సుప్రీంకోర్టులో ఒకరు కూడా న్యాయవాది క్రిస్టియన్ లేరు.. బయట దేశాల నుండి దేశంలో సేవ చేయడానికి ఇక్కడి సంస్థలకు వచ్చే నిధులు మేము ఎప్పుడు ఆపలేదు.. కానీ మోడీ వచ్చాకా.. 6622 సంస్థల %టఎతీఖ% లైసెన్స్ రద్దు చేశారు అని చిదంబరం చెప్పారు. దేశంలో ప్రజాస్వామ్యం మెల్లమెల్లగా తుడిచి పెట్టుకుపోతుంది అని మాజీ కేంద్రమంత్రి చిదంబరం అన్నారు. ప్రజాస్వామ్య స్వేచ్ఛ పోతే మొదట ఇబ్బంది పడేది.. మైనార్టీలు, ప్రజాస్వామ్యం అనేది మనకు కవచం లాంటిది.. దాన్ని అందరం కాపాడుకోవాలి అని ఆయన పేర్కొన్నారు.

## కృష్ణా జలాలను పొదుపుగా
# వాడుకోండి

(మొదటి పేజీ తరువాయి..)

45 టీఎంసీలను కేటాయించింది. రెండు ప్రాజెక్టుల్లో కనీస నీటిమట్టం ఉండేలా చూడాలని పేర్కొంది. రెండు జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటి నుంచి తెలంగాణకు 35, ఆంధ్రపదేశ్‌కు 45 టీఎంసీలు కేటాయించింది. నీటి విడుదలకు సంబంధించి బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశమైంది. కేఆర్ఎంబీ సభ్యకార్యదర్శి రాయిపురే అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలంగాణ నీటిపారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్, ఏపీ జలవనరులశాఖ ఈఎన్సీ నారాయణరెడ్డి పాల్గొన్నారు. కృష్ణా బోర్డు ఛైర్మన్ శివనందన్ కుమార్ కూడా సమావేశంలో ప్రత్యేకంగా హాజరయ్యారు. ఈ ఏడాదిలో సాగు, తాగునీటి అవసరాల కోసం రెండు రాష్ట్రాలు ఇచ్చిన ప్రతిపాదనలపై సమావేశంలో చర్చించారు. ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితుల్లో ఉమ్మడి జలాశయాల్లోకి నీరు అంతగా చేరలేదని, ప్రస్తుతం సాగర్, శ్రీశైలం రెండింటిలో కేవలం 82.78 టీఎంసీలు మాత్రమే వినియోగానికి అందుబాటులో ఉన్నాయని బోర్డు సభ్య కార్యదర్శి రాయిపురే తెలిపారు. రానున్న జూన్, జులై వరకు తాగునీటి అవసరాలు కూడా దృష్టిలో పెట్టుకోవాల్సి ఉందని రాయిపురే అన్నారు. ఈ పరిస్థితుల్లో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని రెండు రాష్ట్రాలకు సూచించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న 80 టీఎంసీల నీటిలో అక్టోబర్ నుంచి మే నెల వరకు తెలంగాణకు 35 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 45 టీఎంసీలు కేటాయించారు. మిగిలిన 2.788 టీఎంసీలతో పాటు ఇంకా ఏవైనా ప్రవాహాలు వస్తే వాటిని కూడా జూన్, జులై తాగునీటి అవసరాల కోసం నిల్వ చేయాలని.. రెండు ప్రాజెక్టుల్లో కనీస నీటిమట్టం ఉండేలా చూడాలని బోర్డు తెలిపింది. మరోవైపు ఈ సంవత్సరం తెలంగాణ 45 టీఎంసీలను వినియోగించుకోగా 15 టీఎంసీలు రాష్ట్ర పరిధిలోని జలాశయాల్లో నిల్వ ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ 95 టీఎంసీలు వినియోగించుకోగా 50 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. శ్రీశైలం జలాశయం నుంచి తెలంగాణ జల విద్యుదుత్పత్తి కోసం విడుదల చేస్తున్న నీటిని ఆ రాష్ట్ర కోటా కిందకు చేర్చాలని ఏపీ కోరగా.. అందుకు తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. సాగర్ నుంచి ఏపీకి నీటి విడుదల ఉండదనీ తెలంగాణ ఆ మేరకు వినియోగించుకుంటుందని తెలపడంతో ఈ అంశం సద్దుమణిగింది. కృష్ణా జలాల విషయంలో బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ తీర్పు అమల్లోకి వస్తే రెండు రాష్ట్రాలకు న్యాయం జరుగుతుందని ఏపీ ఈఎన్సీ నారాయణరెడ్డి పేర్కొన్నారు. శ్రీశైలం జలాశయం నుంచి 30 టీఎంసీలు, నాగార్జునసాగర్ నుంచి 15 టీఎంసీల జలాలు కావాలని కేఆర్ఎంబీ ముందు ప్రతిపాదించినట్లు వివరించారు. బచావత్ ట్రైబ్యునల్ తీర్పు ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 811 టీఎంసీల కేటాయింపులో మార్పు లేదని నారాయణరెడ్డి చెప్పారు. రెండు రాష్ట్రాల్లో ప్రాజెక్టుల వారీగా నీటి వినియోగంపై మాత్రమే కసరత్తు చేయాల్సి ఉంటుందని నారాయణరెడ్డి పేర్కొన్నారు. కృష్ణా జలాల పునఃపంపిణీకి సంబంధించి విధివిధానాలు ఇంకా పూర్తిస్థాయిలో అందిన తరువాతే స్పష్టత వస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలకు విఘాతం కలిగే పరిస్థితి వస్తే రాష్ట్ర ప్రభుత్వం తరఫున సరైన వేదికలపై ఆ విషయాన్ని ప్రస్తావిస్తామని వివరించారు. దిల్లీ పర్యటనలో ఉన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాని మోదీతో పాటు ఇతర ప్రభుత్వ పెద్దలతో చర్చించే అవకాశం ఉందని చెప్పారు. హైదరాబాద్‌లో ఉన్న కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ప్రధాన కార్యాలయాన్ని విశాఖపట్నం తరలించేందుకు అనువుగా నగరంలో భవనం సిద్ధమైందని, బోర్డు అధికారులు వచ్చి పరిశీలించాలని ఈ సందర్భంగా బోర్డు అధికారులకు ఈఎన్సీ నారాయణరెడ్డి సూచించారు.

# రాష్ట్రాన్ని సైబర్ సేఫ్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- సైబర్ నేరాలు ఛాలెంజ్‌గా మారాయి
- దేశం నలుమూలలా నుండి ఎన్నో కోణాల్లో సైబర్ దాడులు
- సైబరాబాద్ కమిషన్ స్టీఫెన్ రవీంద్ర



నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-అక్టోబర్7:

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ లో భారత దేశ మొట్ట మొదటి లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ( చీఫ్ ఇన్ఫర్ మేషన్ సెక్యూరిటీ ఆఫీస్ కౌన్సిల్ )ను తెలంగాణ డీజీపీ అంజనీ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐటీ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్, పలువురు ఐటీ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైబరాబాద్ కమిషన్ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ.. సైబర్ నేరాలు ఛాలెంజ్‌గా మారాయి.. దేశం నలుమూలలా నుండి ఎన్నో కోణాల్లో సైబర్ దాడులు జరుగుతున్నాయి.. దేశంలోనే మొదటి లా ఎన్ఫోర్స్మెంట్ కౌన్సిల్ సైబరా బాద్ లో ప్రారంభం అవ్వడం సంతోషంగా ఉంది అని ఆయన తెలిపారు. సైబర్ నేరాలు చేదించడానికి లా ఎన్ఫోర్స్మెంట్ కౌన్సిల్ ఎంతగానో దోహద పడుతుంది అని స్టీఫెన్ రవీంద్ర అన్నారు. బర్ నేరాలు గుర్తించడం, నేరగాళ్లు విచారణ, దర్యాప్తు చేసి శిక్ష పడేలా చేయడం లా ఎన్ఫోర్స్మెంట్ కౌన్సిల్ ముఖ్య ఉద్దేశ్యం అని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. సైబర్ క్రైమ్ సెక్యూరిటీ కోసమే, డిజిటల్ సెక్యూర్ కోసమే ఈ కౌన్సిల్.. సైబర్ త్రెట్నింగ్స్ పై తెలంగాణ పోలీస్ శాఖ అలెర్ట్ గా ఉంది.. తెలంగాణ రాష్ట్రాన్ని సైబర్ సేఫ్ సిటీగా తీర్చిదిద్దడం లా ఎన్ఫోర్స్మెంట్ కౌన్సిల్ ముఖ్య ఉద్దేశ్యం అని ఆయన పేర్కొన్నారు. గ్లోబల్ లో టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతోంది.. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో అనేక ఇండస్ట్రీ కు సైబర్ ముప్పు నుంచి టెక్నాలజీ సహాయంతో కాపాడ గలుగుతున్నాము అని స్టీఫెన్ రవీంద్ర చెప్పుకొచ్చారు. ఐటీ ఇండస్ట్రీ (ఎంఎస్సి మానిటరింగ్ ఆఫ్ సెక్యూరిటీ వింగ్) ద్వారా సేఫ్ గా తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడుతామని సీపీ స్టీఫెన్ రవీంద్ర పేర్కొన్నారు. ఇంటలిజెన్స్, లీగల్ రెగ్యులేటరీ, ఇన్సిడెంట్ రెస్పాన్స్ ఆయా విభాగాలు పూర్తి సమన్వయం ద్వారా సైబర్ నేరాలు అదుపు చేస్తున్నాం.. సైబర్ ఫిర్యాదులు ఏమైనా ఉంటే.. 1930కి కాల్ చెయ్యండి అని ఆయన అన్నారు.

## నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి జారిపడి వృద్ధుడు మృతి

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-అక్టోబర్7:

వికారాబాద్ జిల్లా తాండూర్ లోని రాజీవ్ కాలనీలో విషాదం చోటు చేసుకుంది. నిర్మాణంలో ఉన్న భవనం పై అంతస్తులో వాటర్ క్యూరింగ్ చేస్తుండగా ప్రమాదవ శాత్తు జారీ కింద పడి జనార్ధన్ అనే (కూలి ) వృద్ధుడు సంఘటన ప్రదేశంలోనే మృతి చెందాడు. దీంతో సదరు బిల్డింగ్ యజమాని ఆ వృద్ధుడి మృతదేహాన్ని తాండూరు ప్రభుత్వ ఆస్పత్రి మార్చరికి తరలించాడు. ఇక, విషయం తెలిసిన మృతుని బంధువులు మార్చురీ దగ్గర ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. అయితే, విషయం తెలుసుకున్న యలాల్ ఎస్ఐ అరవింద్ సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేశాడు. ఇక, ఇదై సమయంలో ఎస్ఐ అరవింద్ బిల్డింగ్ యజమానితో కుమ్మక్కై తమను బెదిరిస్తున్నాడని మృతుని బంధువులు ఆరోపించారు. తాము కర్ణాటక చెందిన వాళ్లం కావడంతో తమను ఇష్టం వ్చ్చినట్లు ఎస్ఐ బూతులు తిట్టాడని మృతుని బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు సరైన న్యాయం చేయాలని వారు నిరసన వ్యక్తం చేస్తున్నారు. తమకు పోలీసులే న్యాయం చేయకపోతే ఇంకెవరు చేస్తారని మృతుని బంధువులు వాపోయారు.

## ఎరుకల సంక్షేమానికి కొత్త పథకం

**- రూ.60కోట్ల నిధులతో ఎరుకల సాధికారత**

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-అక్టోబర్7:

ప్రజల సంక్షేమానికి సీఎం కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం సరికొత్త పథకాలను అమలు చేస్తునున్నది. ఆర్థికంగా నిలదొక్కుకునే విధంగా, కుటుంబానికి భరోసాగా ఆర్థికపరమైన పథకాలను తీసుకువస్తున్నది. రైతుల సంక్షేమం కోసం రైతుబంధు, దళితుల సంక్షేమం కోసం దళితబంధు, బీసీ కులవృత్తుల కోసం బీసీ బంధును అమలు చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం ఎరుకల సంక్షేమం కోసం కొత్త పథకాన్ని తీసుకువచ్చింది. రూ.60కోట్ల నిధులతో ఎరుకల సాధికారత పథకాన్ని ప్రకటించింది. ట్రైకార్ ద్వారా సాధికారత పథకాన్ని అమలు చేయనున్నది. పందుల పెంపకం సొసైటీలకు ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పందుల పెంపకం, స్లాటర్ హౌస్, కోల్డ్ స్టోరేజీలకు, రవాణా, ఫోర్క్ రిటైల్ మార్కెట్ల ఏర్పాటు కోసం ఆర్థిక సాయం చేయనున్నది. యూనిట్‌కు గరిష్ఠంగా రూ.30లక్షల వరకు 50శాతం రాయితీ ఇవ్వనున్నది. 40శాతం బ్యాంకు రుణం, మరో పదిశాతం 10శాతం లబ్ధిదారులు భరించాల్సి ఉంటుంది. పథకం మంజూరు కోసం జిల్లాస్థాయిలో కలెక్టర్ల అధ్యక్షతన కమిటీ పని చేయనుండగా.. ఎస్టీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి నేతృత్వంలో కమిటీ రాష్ట్రస్థాయిలో పథకం అమలును పర్యవేక్షించనున్నది.

## అంజిరెడ్డి హత్యకేసులో ఆరుగురు అరెస్ట్

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-అక్టోబర్7:

సికింద్రాబాద్ సినీ నిర్మాత అంజిరెడ్డి హత్యకేసులో పోలీసులు ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జీఆర్ కన్వెన్షన్‌హాలు యజమాని రాజేష్ చౌకగా ఆస్తికాజేయాలనే ఉద్దేశంతోనే బిహార్‌కు చెందిన కొంత మంది కుర్రాళ్లకు 4లక్షల సుపారీ ఇచ్చి హత్య చేయించినట్టు దర్యాప్తులో తేలింది. హత్య చేసి ప్రమాదంగా చిత్రీకరించాలనే వ్యూహాన్నిపోలీసులు బయటపెట్టారు. అంజిరెడ్డి ఇంటిని చూసిన రాజేష్ రూ.3కోట్ల 50లక్షలకు కొనుగోలు చేసేందు కు అంగీకరించాడు. అడ్వాన్స్‌గా రూ.5 లక్షలు చెల్లించి అగ్రిమెంట్ రాయించుకున్నాడు. అతి తక్కువ ఖర్చుతో ఇల్లు సొంతం చేసుకోవా లనే దురాలోచనతో నిర్మాత హత్యకు పథకం వేశాడు రాజేశ్. తన వద్ద తాత్కాలిక డ్రైవర్‌గా పనిచేసే ప్రభుకుమార్, బిహార్‌కు చెందిన సత్యేందర్, జయమంగళకుమార్, రాజేష్‌కుమార్‌లకు రూ.4 లక్షలు, సుపారీ కుదుర్చుకున్నాడు. హత్య చేసి ప్రమాదంగా చిత్రీకరించాలనే వ్యూహరచన చేశారు. పథకం అమలు చేసేందుకు రాజేష్ గత నెల 29న అంజిరెడ్డికి ఫోన్ చేసి జీఆర్ కన్వెన్షన్ హాలు వద్దకు రప్పిం చాడు. తన కారులో అక్కడకు చేరిన అంజిరెడ్డి కారును రెండో సెల్లార్ లో పార్కు చేశాడు. జీఆర్ కన్వెన్షన్ హాలుకు చేరాడు. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న ఆరుగురు.. నిందితుడిని బెదిరించి ఆ ఇంటిని రూ.2. 10 కోట్లకు విక్రయించినట్టు పత్రాలపై సంతకాలు తీసుకున్నారు. లిఫ్ట్ వద్దకు చేరగానే అంజిరెడ్డిపై దాడి చేసి హతమార్చారు. మృతదేహాన్ని లిఫ్ట్ ద్వారా సెల్లార్‌లోని అతడి కారు వద్దకు తీసుకె ళ్లారు. అంజిరెడ్డి మృతదేహాన్ని కారు డ్రైవింగ్ సీట్లో కూర్చొబెట్టారు. ఇంజన్ ఆన్ చేసి వెనుక నుంచి నెట్టడంతో వేగంగా వెళ్లిన కారు పిల్లర్‌ను ఢీకొట్టింది. ఇదంతా ప్రమాదంగా చిత్రీకరించి అంజిరెడ్డి కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. అంజిరెడ్డి కుమారుడు చరణ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు గోపాలపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన పోలీసులు అంజిరెడ్డి ప్రమాదంలో మరణించలేదని గుర్తించారు. నిందితుల ప్రవర్తన, మాటలు, సీసీ టీవీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా ఇది పక్కా పథకం ప్రకారం జరిగిన హత్యగా నిర్ధారించారు. నిందితులను అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా తొలుత తమకేం తెలియదని బుకాయించారు. తరువాత ఆస్తి కోసమే దారుణానికి తెగించినట్టు అంగీకరించారు. నిందితులు రాజేష్, ప్రభుకుమార్, సత్యేందర్, మం గళకుమార్, రాజేష్‌కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## రాష్ట్రంలో కొత్తగా 57 కోర్టులు మంజూరు

### బాలలపై నేరాల విచారణకు 10 ప్రత్యేక కోర్టులు

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-అక్టోబర్7:

రాష్ట్రంలో రోజురోజుకు నేరాలు పెరిగిపోతున్నాయి. కానీ ఈ కేసులను పరిష్కరించేందుకు మాత్రం సరిపడా కోర్టులు.. న్యాయ సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. ఫలితంగా ఏళ్ల తరబడి కోర్టుల్లో పెండింగ్ కేసులు గుట్టలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. రాజీలు కుదుర్చుతూ పలు కేసులు పరిష్కరిస్తున్నా లక్షల్లో పెండింగ్ కేసులు ఇంకా మూలన పడే ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో ఈ సమస్య పరిష్కారానికి తెలంగాణ సర్కార్ నడుం బిగించింది. అందులో భాగంగా రాష్ట్రంలో నూతన కోర్టులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో 57 నూతన కోర్టులను మంజూరు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు.. కోర్టుల ఏర్పాటే కాకుండా.. ఇప్పటి వరకు ఉన్న కోర్టులో.. రాబోయే కొత్త కోర్టుల్లో సిబ్బంది నియామకానికి త్వరలోనే ఉత్తర్వులు జారీ చేస్తామని పేర్కొంది. ష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 57 కోర్టులను మంజూరు చేస్తూ తెలంగాణ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి, జూనియర్ సివిల్ జడ్జి, సీనియర్ సివిల్ జడ్జి కేడర్లలో ఈ కోర్టులను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి ఆర్.తిరుపతి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో పెరుగుతున్న కేసులను పరిగణనలోకి తీసుకుని కొత్త కోర్టులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందంటూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ ప్రతిపాదనలపై రాష్ట్ర సర్కార్ సానుకూలంగా స్పందించింది. వెంటనే.. సర్కార్ ఆర్థిక శాఖ ఆమోదంతో కొత్త కోర్టులను మంజూరు చేసింది. ఇందులో బాలలపై జరిగే నేరాల విచారణకు.. ప్రత్యేకంగా 10 కోర్టుల ఏర్పాటుకు ప్రాధాన్యమిచ్చింది. కొత్త కోర్టుల్లో సిబ్బంది నియామకానికి ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపింది. కోర్టుల ఆధునికీకరణతో ప్రజలకు సత్వర న్యాయం: జస్టిస్ ఎన్వీ రమణ మరోవైపు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలానికి అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టు మంజూరు కావటంపై భద్రాచలం పట్టణ బార్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. కోర్టును తీసుకువచ్చేందుకు కృషిచేసిన భద్రాచలం పట్టణానికి చెందిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భీమపాక నగేశ్, జిల్లా జడ్జి పాటిల్ వసంత్, న్యాయమూర్తులకు బార్ అసోసియేషన్ కృతజ్ఞతలు తెలిపింది. అదనపు కోర్టుతో పెండింగ్ కేసులకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని స్థానికులు, న్యాయవాదులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## కామారెడ్డి ప్రజలు కేసీఆర్‌కు సినిమా చూపిస్తారు

### మాజీ మంత్రి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత షబ్బీర్ అలీ

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-అక్టోబర్7:

కాంగ్రెస్ పార్టీపై మంత్రి కేటీఆర్ చేసిన విమర్శలకు మాజీ మంత్రి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత షబ్బీర్ అలీ స్పందించారు. కాంగ్రెస్ ఆకాశం లాంటిది..ఆకాశంపై ఉమ్మితే మీపైనే పడుతుంది అంటూ కేటీఆర్ కు కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ పేరు దుబాయ్ కేసీఆర్.. దుబాయ్ ఏజెంట్ కొడుకు నాపై మాట్లాడటం విడ్డురంగా ఉందంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల డబ్బు తో 4 హెలికాప్టర్ లల్లో ఎన్నికల ప్రచారం చేస్తున్నారు.. హెలికాప్టర్ లలో తిరగడానికి డబ్బులు ఎక్కడివి?.. ఈ అంశం పై ఎన్నికల కమిషన్ కు పిర్యాదు చేస్తాం.. మిగతా మంత్రులకు హెలికాప్టర్లు ఎందుకు ఇవ్వడం లేదు అని ఆయన ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ ఊసర వెల్లిలా డబుల్ గేమ్ అడుతారు.. 2004 ఎన్నికల్లో కేసీఆర్ నన్ను ఓడించాలని చూసారు అని షబ్బీర్ అలీ ఆరోపించారు. మంత్రి కేటీఆర్‌కు చరిత్ర తెలియదు అని షబ్బీర్ అలీ అన్నారు. సీఎం కేసీఆర్ కంటే 9 ఏళ్ల ముందు మంత్రి అయ్యాను.. నాపై ఒక్క అవినీతి ఆరోపణలు లేవు.. అది షబ్బీర్ అలీ అంటే.. కేసీఆర్, కేటీఆర్ పై ఈడీ, సీబీఐ కేసులు ఉన్నాయి.. అవినీతికి కేరాఫ్ అడ్రస్ కల్వకుంట్ల కుటుంబం అని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ ఆఫీస్ లోనే దళిత బంధు, బీసీ బంధు, మైనార్టీ లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు అని అన్నారు. దళిత బంధుకు 3 లక్షల రూపాయలను వసూలు చేస్తున్నారు.. దీనిపై కేటీఆర్ సమాధానం చెప్పాలి అని డిమాండ్ చేశారు. తెలంగాణను అమ్ముకోమని కేసీఆర్, కేటీఆర్ చెబుతున్నారు.. కార్యకర్తలు లూటీ చేస్తున్నారు అంటూ షబ్బీర్ అలీ మండిపడ్డారు. తెలంగాణలో కాంగ్రెస్ 80 సీట్లకు పైగా గెలుస్తుంది అని షబ్బీర్ అలీ ధీమా వ్యక్తం చేశారు. పోలీసులపై చేయి చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి.. బీఆర్ఎస్ నాయకులు రౌడీల్లా వ్యవహరిస్తున్నారు.. ప్రశ్నిస్తే ప్రల పై దాడికి పాల్పడుతున్నారు.. టికెట్లు ఫైనల్ కాలేదు.. అమ్ముకుంటున్నారంటే ఎలా?.. నాకు రేవంత్ రెడ్డికే ఇంకా టికెట్లు ఫైనల్ కాలేదు అని తెలిపారు. తెలంగాణలో ఎక్కడ 24 గంటల కరెంట్ వస్తుందో నిరూపించు అని కేటీఆర్ కు షబ్బీర్ అలీ సవాల్ విసిరారు. సిరిసిల్లకు నేనే వస్త 24 గంటల కరెంట్ రావడం లేదని నిరూపిస్తా.. కేసీఆర్ కు రాజకీయ భిక్ష పెట్టిన పార్టీ కాంగ్రెస్.. కామారెడ్డి ప్రాంతంలో సీఎం ఒక దుబాయి కేసీఆర్.. తక్కువ దూరంలో హెలి క్యాపిటర్ లో తిరగడానికి ఎలా అనుమతి ఇచ్చారు అని ఆయన ప్రశ్నించారు. కామారెడ్డి సభలో మంత్రి కేటీఆర్ చెప్పినవన్నీ అబద్ధాలేనని షబ్బీర్ అలీ అన్నారు. కేసీఆర్ ది డబుల్ గేమ్.. కాంగ్రెస్ హయాంలోనే విద్యుత్ ప్రాజెక్టులు.. కేసీఆర్ కుటుంబంలో అందరిపై కేసులున్నాయి.. అవినీతికి మారుపేరు కల్వకుంట్ల కుటుంబం అని ఆయన ఆరోపించారు. నా పై ఒక్క పిటి కేసు కూడా లేదు అని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. కామారెడ్డి ప్రజలు సీఎం కేసీఆర్ కు పెద్ద సినిమా చూపిస్తారు.

## యాదాద్రిపై పర్యావరణ అనుమతుల పేరుతో కుట్ర

**తుది అనుమతుల మంజూరులో కేంద్ర ప్రభుత్వం తీవ్ర జాప్యం**

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్, అక్టోబర్7:

నల్లగొండ జిల్లా దామరచర్లలో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్ (వైటీపీఎస్)కు అవసరమైన అనుమతుల మంజూరులో కేంద్ర అటవీ, పర్యావరణశాఖ తీవ్ర జాప్యం చేస్తున్నది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం టీఎస్ జెన్‌కో ఆధ్వర్యంలో 4,000 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యంతో 2017 జూలైలో వైటీపీఎస్ నిర్మాణానికి శ్రీకారం చుట్టగా ఇప్పటికే 73% పనులు పూర్తయ్యాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలోనే రూ.29,965.48 కోట్లతో ఈ ప్రాజెక్టును చేపట్టగా.. ఇప్పటికే రూ.21, 837.02 కోట్ల పనులు పూర్తయ్యాయి. నిజానికి వైటీపీఎస్‌కు కేంద్ర పర్యావరణ, అటవీ, ?క్లైమేట్‌చేంజ్ శాఖ 2017 జూన్ 29న పర్యావరణ అనుమతులిచ్చింది. తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు కూడా ఆ మరుసటి నెల 25న క్లియరెన్స్ ఇచ్చింది. అన్ని రకాల అనుమతులు రావడంతో టీఎస్ జెన్‌కో యుద్ధప్రాతిపదికన పనులను ప్రారంభించారు. అయితే కరోనా మహమ్మారితోపాటు చెన్నైలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ)లో రెండు స్వచ్ఛంద సంస్థలు (ఎన్జీవో) వేసిన పిటిషన్ల కారణంగా నిర్మాణంలో కొంత జాప్యం జరిగింది. కేసులు వేసిన ముంబైకి చెందిన కన్జర్వేషన్ యాక్షన్ ట్రస్ట్, విశాఖపట్టణానికి చెందిన సమత సంస్థల కేసులను వాదిస్తున్న న్యాయవాది రిత్విక్‌దత్తాకు అమెరికన్ సంస్థల నుంచి నిధులు వస్తున్నాయనే ఆరోపణలు ఉండటం గమనార్హం. ఈ నేపథ్యంలో విద్యుత్తు కేంద్రానికి సంబంధించిన సివిల్ పనులు చేసుకోవచ్చని, కమిషనింగ్ మాత్రం నిలిపివేయాలని ఎన్జీటీ ఆదేశించింది. ఈ సందర్భంగా కేంద్ర పర్యావరణ, అటవీ శాఖకు ఎన్జీటీ చేసిన పలు సూచనలు చేసింది. ఆయా సూచనలను, అధ్యయనాలను టీఎస్‌జెన్కో తొమ్మిది నెలల్లోనే పూర్తిచేసి, కేంద్రానికి సమర్పించింది. ఈ అధ్యయనాలకు అనుగుణంగా అవసరమనుకుంటే రివైజ్డ్ టెర్మ్ ఆఫ్ రిఫరెన్స్ (టీవోఆర్)ను నిర్దేశించిన గడువు (9 నెలలు)లోగా సిద్ధం చేసి, ప్రాజెక్టును ప్రారంభించడానికి పూర్తి అనుమతి ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర పర్యావరణ, అటవీశాఖపై ఉన్నది. ఆ గడువు 2023 జూన్ నాటికే ముగిసినప్పటికీ వైటీపీఎస్‌ను ప్రారంభించేందుకు పూర్తిస్థాయి అనుమతులను ఇవ్వడంలో కేంద్ర అటవీ, పర్యావరణశాఖ జాప్యం చేస్తున్నది. వైటీపీఎస్ ప్రారంభానికి అనుమతులు ఇవ్వాలని ఇప్పటికే అనేకసార్లు టీఎస్ జెన్‌కో కేంద్ర అటవీ, పర్యావరణ శాఖకు లేఖలు రాసింది. అంతేకాకుండా 2023 మే 11న కేంద్ర విద్యుత్తు శాఖ కార్యదర్శి అలోక్‌కుమార్ సైతం సమస్యను వెంటనే పరిష్కరించి, అనుమతులు మంజూరు చేయాలని పర్యావరణశాఖ కార్యదర్శి లీనానందన్‌కు లేఖ రాశారు. నాలుగు నెలలైనా పర్యావరణ శాఖ నుంచి స్పందన లేదు. కేంద్రంలోని ఒక మంత్రిత్వ శాఖ రాసిన లేఖను మరో మంత్రిత్వశాఖ పట్టించుకోకపోవడం విడ్డూరం. ప్రభుత్వ రంగ సంస్థల ఆధ్వర్యంలో ఒకేచోట 4,000 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు కేంద్రాన్ని నిర్మించడం బహుశా దేశంలోనే ఇదే ప్రథమం. అంతటి ప్రతిష్ఠాత్మక యాదాద్రి థర్మల్ ప్రాజెక్టుకు సంపూర్ణ సహకారం అందించాల్సిన అటవీ, పర్యావరణ శాఖ ఇప్పటికైనా మేల్కొనాలి. దేశవ్యాప్తంగా విద్యుత్తు అవసరాలు, విద్యుత్తు కోతలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్టు ప్రారంభానికి బాసటగా నిలవాల్సిన బాధ్యత కేంద్రంపై ఉన్నది.



## చంద్రబాబు అరెస్టు అక్రమం

- టీడీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర నాయకులు ఎస్‌కే.రాజు
- తొర్రూర్‌కు చేరుకున్న టీడీపీ నేతల సైకిల్ యాత్ర



తొర్రూర్, నేటి ఫోకస్ న్యూస్-అక్టోబర్ 07:

మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టు అక్రమమని టిడిపి సాంస్కృతిక విభాగం రాష్ట్ర నాయకులు ఎస్కే రాజు అన్నారు.మాజీ సీఎం చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రాజమండ్రి వరకు చేపట్టిన పార్టీ నాయకుల సైకిల్ యాత్ర పట్టణ కేంద్రానికి చేరుకుంది. డివిజన్ కేంద్రంలో టిడిపి నేతల సైకిల్ యాత్రకు పార్టీ మండల అధ్యక్షుడు భోగ భాస్కర్ స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎస్కే రాజు మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చిన చంద్రబాబును అరెస్టు చేయడం దారుణమని, తెలుగు ప్రజల ఆగ్రహాన్ని జగన్ కు తెలిపేందుకు రాజమండ్రి వరకు సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టి రిమాండ్‌కు తరలించి జగన్ పైశాచికానందం పొందుతున్నాడని, సీఐడీ తన విచారణ సమయంలో ఒక్క శిక్షణ కేంద్రాన్నీ సందర్శించలేదని, ఎక్కడా తనిఖీలు చేయలేదని శిక్షణ పొందిన లక్షలాది విద్యార్థులెవరినీ శిక్షణ గురించి ప్రశ్నించలేదని, అయినా అక్రమాలు జరిగాయని తేల్చటం సరికాదన్నారు. జగన్‌రెడ్డి ప్రోద్బలంతోనే సీఐడీ వ్యవహరిస్తోందని తేటతెల్లమైందన్నారు. సైకిల్ యాత్రలో పెద్ద వంగర మండల అధ్యక్షుడు బైన బిక్షపతి నాయకులు కడకంచి నవీన్ కుమార్, సోరపాక జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## నిరంతర విద్యుత్ ఘనత కేసీఆర్‌దే

- ధర్నాలు, రాస్తారోకోలు మాయం: ఎర్రబెల్లి

నేటి ఫోకస్ న్యూస్, జనగామ, అక్టోబర్7:

దేశంలో వ్యవసాయ రంగానికి నిరంతరాయంగా ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. సీఎం కేసీఆర్ ముందుచూపుతోనే విద్యుత్ కోతలు లేవని కొనియాడారు. సమైక్య రాష్ట్రంలో తీవ్రమైన విద్యుత్ కొరత ఉండేదని, కరెంటు కోసం రైతులు, ప్రజలు నిత్యం రోడ్లపై ధర్నాలు, రాస్తారోకోలు చేసిన ఘటనలను గుర్తుచేశారు. ప్రధాని మోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో విద్యుత్ కొరత ఉన్నదని, పవర్ హాలీడే ప్రకటించినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ దూరదృష్టితో వ్యవహరించి రూ.96,500 కోట్లు ఖర్చు చేసి విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసి దేశంలోనే 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్న ఏకైక తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దారన్నారు. తలసరి విద్యుత్ వినియోగంలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉన్నదన్నారు. రాష్ట్ర విభజన కింద తెలంగాణకు 7780 మెగావాట్ల విద్యుత్ వచ్చిందని, సీఎం కేసీఆర్ ముందుచూపు, సీఎండీ ప్రభాకర్‌రావు చొరవతో నేడు 20వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసి దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో ఉన్నామని చెప్పారు. వేసవికాలంలో నిమిషం కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని కొనియాడారు.

## అన్నివర్గాల సంక్షేమమే కేసీఆర్ లక్ష్యం

- హ్యాట్రిక్ విజయం ఖాయం: జీవన్ రెడ్డి

నేటి ఫోకస్ న్యూస్, నిజామాబాద్-అక్టోబర్7:

ముఖ్యమంత్రి కేసీఆర్ సబ్బండ వర్గాలకు సమ ప్రాధాన్యం అందిస్తూ వారి అభివృద్ధి, సంక్షేమానికి పాటు పడుతున్నారని ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం దేశం గర్వించేవిధంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రతి కుటుంబంలో మనో ధైర్యాన్ని, సంతోషాన్ని కల్పిస్తుందన్నారు. ప్రతి పక్షాలకు దిమ్మతిరిగేలా బీఆర్ఎస్ మెనిఫెస్టో రాబోతుందన్నారు. ఎవరు ఎన్ని జిమ్మిక్కులు చేసిన హాట్రిక్ కొట్టేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మరోసారి అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని, ప్రజల ఆశీర్వాదంతో కేసీఆర్ సీఎం కావడం ఖాయమన్నారు.

## 9న మంత్రి కేటీఆర్ రాక..

నేటి ఫోకస్ న్యూస్, జయశంకర్‌భూపాలపల్లి, అక్టోబర్7:

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ఈ నెల 9వ తేదీన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటించనున్నట్లు బీఆర్ఎస్ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి వెల్లడించారు. ఈ పర్యటన సందర్భంగా కేటీఆర్ పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారని తెలిపారు. భూపాలపల్లిలో నూతనంగా నిర్మించిన సమీకృత కలెక్టరేట్, జిల్లా పోలీసు శాఖ కార్యాలయాన్ని కేటీఆర్ ప్రారంభిస్తారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో 460 డబుల్ బెడ్రూం ఇండ్లను లబ్దిదారులకు అందజేస్తారు. 1100 మంది లబ్దిదారులకు దళిత బంధు మంజూరు పత్రాలను అందిస్తారు. నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే ఎంపిక చేసిన 4500 మందికి గృహలక్ష్మి మంజూరు పత్రాలను అందజేస్తారని ఎమ్మెల్యే తెలిపారు.

## 15 నుంచి 23వ తేదీ వరకు శరన్నపేట ఉత్సవాలు

నేటి ఫోకస్ న్యూస్, పాపన్నపేట, అక్టోబర్7:

ఏడుపాయల వనదుర్గా భవానీ మాత సన్నిధిలో ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ నెల15న మొదటి రోజు శరన్నవరాత్రి ఉత్సవాలను అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి మెదక్ ఎమ్మెల్యే పద్మాదేందర్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. అదేరోజు శ్రీశైలపుత్రి (బాలా త్రిపుర సుందరి) అవతారంలో దర్శనం ఇవ్వనున్నారు. రెండో రోజు బ్రహ్మచారిని (గాయత్రీ దేవి)గా, మూడో రోజు చంద్ర గంట (అన్నపూర్ణ) అవతారంలో దర్శనం ఇస్తారు. నాలుగో రోజు కూష్మాండ (వనదుర్గా)గా, ఐదో రోజు స్కంద మాత (మహాలక్ష్మి)గా, ఆరో రోజు షష్టి కాత్యాయని (సరస్వతిదేవి)గా దర్శనమిస్తారు. ఏడో రోజు కాల రాత్రి (దుర్గాదేవి), 8వ రోజు మహా గౌరీ సిద్ధి రాత్రి (మహిషాసురా మర్ధిని)గా, చివరి రోజు 9వ రోజు నవమి, దశమి (విజయదశమి) రాజరాజేశ్వరీదేవీగా దర్శనం ఇస్తారని ఏడుపాయల చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్‌రెడ్డి వెల్లడించారు.



## ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్‌లో

# చిరంజీవి-సురేఖ దంపతులు

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ, సొట్ట బుగ్గల సుందరి లావణ్య త్రిపాఠి పెళ్లి బంధంతో ఒక్కటి కాబోతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే వారి నిశ్చితార్థం అయిపోయింది. ఇప్పుడు పెళ్లి వేడుకలు కూడా ప్రారంభమైపోయాయి. నిన్న సాయంత్రం వరుణ్, లావణ్యల ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్‌ను కుటుంబ సభ్యులు ప్రారంభించారు. ఈ ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్‌లో మెగా, అల్లు ఫ్యామిలీ సభ్యులంతా పాల్గొన్నారు. ఈ మేరకు వరుణ్ తేజ్ పెదనాన్న, మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియా ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. అందమైన ఫొటోలు కూడా షేర్ చేశారు. ఈ ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్‌లో చిరంజీవి-సురేఖ దంపతులు, నాగబాబు-పద్మజ దంపతులు, చిరంజీవి ఇద్దరు చెల్లెల్లు, వారి భర్తలు, పిల్లలు సహా రామ్ చరణ్, ఉపాసన, సాయిధరమ్ తేజ్, వైష్ణవ్ తేజ్, అల్లు శిరీష్, సుస్మిత కొణిదెల, శ్రీజ కొణిదెల, నిహారిక కొణిదెల, చిరంజీవి తల్లి అంజనాదేవి, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి జంటకు ఈ ఏడాది జూన్ 9వ తేదీన హైదరాబాద్‌లోని నాగబాబు స్వగృహంలో జరిగింది. ఈ నిశ్చితార్థ వేడుకలో ఇరు కుటుంబాల సభ్యులు, చిరంజీవి, అల్లు అరవింద్ సహా కొద్దిమంది బంధుమిత్రులు మాత్రమే పాల్గొన్నారు. కాగా, నిశ్చితార్థం జరిగిన మూడు నాలుగు నెలల్లో వరుణ్, లావణ్య జంట పెళ్లి పీటలు ఎక్కుతారని ఆ మధ్య వార్తలు వచ్చాయి. ఇటలీలో పెళ్లి వేడుక జరగనుందని అన్నారు.



# బాలయ్యకు జోడీగా కాజల్ అగర్వాల్..




## సినిమాలో విలన్‌గా అర్జున్ రాంపాల్

**మాములుగా బాలయ్య అంటేనే** ఒక ఎనర్జీ. లాజిక్‌లు గట్రా పక్కన పెడితే బాలయ్య ఊరమాస్ ఫైటింగ్స్‌కు జనాల్లో పిచ్చ క్రేజ్ ఉంటుంది. ఒక్క తన్ను తంతే సుమోలో గాల్లో ఎగరడాలు, తొడ గొడితే రైల్లు వెనక్కు వెల్లడాలు ఇలా ఇవన్నీ వేరే వాళ్లు చేస్తే అతి అనిపిస్తుంది కానీ.. బాలయ్య చేస్తే మట్టుకు థియేటర్‌లో అలాంటి సీన్లకు విజిల్స్ పడతాయి. మరీ ముఖ్యంగా ఆయన విలన్స్‌తో చెప్పే డైలాగ్స్.. వార్నింగ్స్ వేరే లెవల్లో ఉంటాయి. ఇక ఆయన విలన్లు కూడా బాలయ్యకు ధీటుగా ఊరమాస్‌గా ఉంటారు. అయితే తాజాగా భగవంత్ కేసరి విలన్ లుక్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఇందులో విలన్ సూటు బూటు వేసుకుని క్లాస్ లుక్‌లో ఉన్నాడు. బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్ ఈ సినిమాలో విలన్‌గా నటిస్తున్నాడు. మొదటి నుంచి బాలయ్యను అంత ఊరమాస్‌గా చూపించి.. విలన్‌ను ఇంత క్లాస్‌గా చూపించడంతో అభిమానులు ఒక్క సారిగా షాక్ అయ్యారు. మరోవైపు ఇలాంటి క్లాస్ విలన్‌తో బాలయ్య వేట ఎలా ఉంటుందోఅని అమితాసక్తి చూపిస్తున్నారు. ఇక ఈ సినిమా ట్రైలర్ ఆదివారం రాత్రి 8 గంటల 16 నిమిషాలకు రిలీజ్ కానున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఇక ఈ సినిమా బిజినెస్ ఓ రేంజ్‌లో జరుగుతుందని ఇన్‌సైడ్ టాక్. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాకు సుమారుగా రూ.60 కోట్ల రేంజ్‌లో బిజినెస్ జరుగుతుందని తెలుస్తుంది. ఇక రెస్ట్ ఆఫ్ ఇండియా, ఓవర్సీస్ కలుపుకుంటే మరో రూ. 20 కోట్లు ఈజీగా బిజినెస్ జరుగుతుందట. మొత్తంగా చూసుకుంటే బాలయ్య కెరీర్‌లోనే అత్యధికంగా రూ.80 కోట్ల రేంజ్‌లో బిజినెస్ జరుపుకుంటుందట. ఇది బాలయ్య కెరీర్‌లో ఆల్‌టైమ్ రికార్డు. పోటీగా లియో, టైగర్ నాగేశ్వరరావు వంటి సినిమాలున్నా ఈ రేంజ్‌లో బాలయ్య సినిమాకు బిజినెస్ జరుగుతుందంటే మాములు విషయం కాదు. అనీల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో బాలయ్యకు జోడీగా కాజల్ అగర్వాల్ నటిస్తుంది. శ్రీలీల కీలక పాత్ర చేస్తుంది. థమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను షైన్ స్క్రీన్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్నాడు.

# జయా బచ్చన్ అంటే భయం

**తన భార్య జయా బచ్చన్** గురించి బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జయా బచ్చన్ అంటే తనకు చాలా భయమని చెప్పారు. బిగ్‌బీ హోస్ట్ చేస్తున్న 'కౌన్ బనేగా కరోడ్ పతి' టాక్ షోకు ఏ రేంజ్‌లో రెస్పాన్స్ ఉంటుందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఈ షో ద్వారా అమితాబ్ తన వ్యక్తిగత విషయాలను కూడా అప్పుడప్పుడూ షేర్ చేసుకుంటున్నారు. ఈ టాక్ షోలో ఇప్పటివరకు వచ్చిన 14 సీజన్‌లు ఊహించని స్థాయిలో రెస్పాన్స్ తెచ్చుకున్నాయి. ఇక ఇప్పుడు 15వ సీజన్ నడుస్తోంది. తాజా సీజన్‌లో 40వ ఎపిసోడ్‌లో చత్తీస్‌గఢ్‌కు చెందిన జయా పటేల్ అనే మహిళ పాల్గొంది. ఈ సందర్భంగా కంటెస్టెంట్‌ను 'మీరు ఓ టీచర్ అయితే ఎలా ఉంటారు..? స్ట్రిక్ట్‌గానా.. లేక సరదాగా ఉంటారా..?'



అని అమితాబ్ ప్రశ్నించారు. దానికి ఆమె 'సార్, నేను టీచింగ్ చేసేటప్పుడు కఠినంగానే వ్యవహరిస్తాను. మిగతా సమయాల్లో సాధారణంగా కూల్‌గానే ఉంటాను' అంటూ చెప్పుకొచ్చింది. అనంతరం కంటెస్టెంట్ జయా పటేల్.. బిగ్‌బీని కూడా జయా బచ్చన్ గురించి ప్రశ్నించింది. దీనికి బిగ్‌బీ సమాధానమిస్తూ.. 'ఆమె (జయా బచ్చన్) నా పట్ల చాలా స్ట్రిక్ట్‌గానే ఉంటుంది. అయినా ఇలాంటి ప్రశ్నలు ఎందుకు అడుగుతారు. ఆమెతో కలిసి ఈ షో చూసేటప్పుడు నాకు ఉంటుంది. ఆ సీన్ తలచుకుంటుంటేనే నాకు భయంగా ఉంది. అందుకే వ్యక్తిగత విషయాల గురించి పెద్దగా బయటకు చెప్పను' అంటూ అమితాబ్ సరదాగా వ్యాఖ్యానించారు. ప్రస్తుతం బిగ్‌బీ కామెంట్స్ వైరల్ అవుతున్నాయి.